క్లుప్తంగా

మోదీతోనే దేశాభివృద్ధి



ఆర్మూర్‌టౌన్: దేశ అభివృద్ధి కేవలం ప్రధాని మోదీతోనే సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లెగంగారెడ్డి అన్నారు. పట్టణంలో మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో ఆయన కేంద్ర ప్రభుత్వ పథకాల పుస్తకాలను పలువురికి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో, దేశంలో బీజేపీని బలపర్చాలని ప్రజలను కోరారు. జిల్లా ప్రధానకార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి, నాయకులు జెస్సు అనిల్, ద్యాగఉదయ్, రాజేష్, బాలు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీవన్‌రెడ్డిపై ఎవరు పోటీచేసినా ఓడిస్తాం

ఆర్మూర్‌టౌన్: వచ్చే ఎన్నికల్లో ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై రేవంత్‌రెడ్డితో పాటు ఎవరు పోటీ చేసినా, ఓడిస్తామని బీఆర్ఎస్ నాయకుడు టెలికాం డైరెక్టర్ షాహెద్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవన్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్యకర్త పోటీ చేసినా గెలుస్తాడన్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. యూత్ పట్టణ అధ్యక్షుడు పృథ్వీరాజ్, మీరా శ్రవణ్, రంజిత్, వెంకట్, రఘు, రాజు, సందీప్ పాల్గొన్నారు

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు మంగళవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పుప్పాల శంకర్, మాజీ ఎంపీపీ గంధపు పవన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి బాన్సువాడ కాంగ్రెస్ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ నాయకుడు, కౌన్సిలర్ కాసుల రోహిత్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పోతంగల్ పట్టణ అధ్యక్షుడు సాయిలు, డీసీసీ ప్రధాన కార్యదర్శి హనుమంతు, వెంకన్న, గంధపు రాజు, హన్మండ్లు ఉన్నారు.

లింగ వివక్షను నివారించాలి

బోధన్‌రూరల్(బోధన్): సమాజంలో లింగ వివక్షను నివారించాలని, ఇందుకోసం తల్లిదండ్రులు తమ పిల్లలకు లింగ సమానత్వంపై అవగాహన కల్పించాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త స్వప్న పేర్కొన్నారు. మండలంలోని బెల్లాల్, ఊట్‌పల్లి గ్రామంలో మంగళవారం ఆమె బేటీ బచావ్ – బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు దేవమణి, కమల పాల్గొన్నారు.

కూనేపల్లి ఉప సర్పంచ్‌గా మల్లేష్



రెంజల్(బోధన్): మండలంలోని కూనేపల్లి ఉప సర్పంచ్‌గా ఆరవోయిన మల్లేష్‌ను పాలకవర్గ సభ్యులు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల ఉప సర్పంచ్‌గా పనిచేసిన పత్రోల్ల మొగులయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో జిల్లా పంచాయతీ అధికారిణి ఆదేశాల మేరకు సర్పంచ్ రొడ్డ విజయ అధ్యక్షతన పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వారు ఉప సర్పంచ్‌గా మల్లేష్‌ను ఎన్నుకున్నారు. కార్యదర్శి ఆయనకు నియామకపత్రం అందించారు.

నిధులపై చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

వేల్పూర్: కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను డబుల్ బిల్లింగ్‌గా కాజేస్తున్నారని ఎంపీ అర్వింద్ ఆరోపించడం, ఆవిధంగా చేస్తే ఏ విచారణ అయినా జరిపించుకోవచ్చని మంత్రి ప్రశాంత్ రెడ్డి పేర్కొనడంపై ఇరువురు చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. వేల్పూర్‌లో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. నిధుల వినియోగంలో ఇరువురు నాయకులు సీబీఐ చేత విచారణ జరిపించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. గడ్డం నర్సారెడ్డి, జిల్లా కార్యదర్శి దామోదర్‌గౌడ్, పన్నాల మల్లేష్, రేవంత్, గంగయ్య, రమణ, జంగన్న, జనార్దన్ ఉన్నారు.

బీసీలను మోసం చేయడం తగదు

మోర్తాడ్: రైతుబంధు పథకంతో దొరలకు రూ.కోట్లు జమ చేసి బీసీలకు రూ.లక్ష పేరుతో మోసం చేయడం తగదని ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు భోగ దేవేందర్ అన్నారు. మోర్తాడ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా గుర్తుకురాని బీసీలు ఎన్నికలు వస్తున్నాయనగానే గుర్తుకు వచ్చారా అని ప్రశ్నించారు. బాల్కొండ నియోజకవర్గంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి, అతను నమ్ముకున్న దొరలకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని వెల్లడించారు. పార్టీ మండల అధ్యక్షుడు పుప్పాల నరేష్, నాయకులు లక్ష్మీనర్సయ్య, మురళిగౌడ్, గంగామోహన్, రాజేష్, సాగర్, గణేష్, శ్రీకాంత్, సురేందర్ ఉన్నారు.

బీటీ రోడ్లు.. నాణ్యతకు తూట్లు

- నాలుగు నెలలు నిలువని వైనం
- డొంకేశ్వర్ మండలంలో ఇటీవల నిర్మించిన రహదారుల దుస్థితి

డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు పెట్టి పల్లెలకు వేసిన బీటీ రోడ్లు పది రోజులు కూడా నిలుస్తలేవు. కాంట్రాక్టర్ల కక్కుర్తితనం, అధికారుల పట్టింపులేనితనంతో రోడ్లు నాసిరకంగా మారుతున్నాయి. డొంకేశ్వర్ మండలంలో ఇటీవల పలు గ్రామాలకు వేసిన బీటీ రోడ్లు గుంతలు తేలుతున్నాయి. ఎక్కడికక్కడ పగుళ్లు ఏర్పడి కుంగిపోతున్నాయి. చిన్నయానం గ్రామానికి చాలఏళ్ల తర్వాత రోడ్డు వచ్చిందని ప్రజలు సంతోషపడ్డారు. కానీ, ఆ సంతోషం కొన్ని రోజులు కూడా నిలువలేదు. నెల క్రితం రూ.2.69కోట్ల నిధులతో గాదేపల్లి శివారు నుంచి చిన్నయానం వరకు మొత్తం 2.7కి.మీ బీటీ రోడ్డు వేశారు.కానీ, నాణ్యతప్రమాణాలు పాటించకపోవడంతో రోడ్డు కుంగిపోయి



నెల క్రితం వేసిన చిన్నయానం బీటీ రోడ్డు పరిస్థితి

గుంతలు తేలుతోంది. అలాగే నాలుగు నెలల క్రితంగా ఈ రూ.24లక్షల నిధులతో డొంకేశ్వర్ కమాన్



గుంతలు తేలిన డొంకేశ్వర్–నూత్‌పల్లి బీటీ రోడ్డు

నుంచి నూత్‌పల్లికి వెళ్లే రోడ్డులో ఒక కిలో మీటరు బీటీ వేశారు. దీనిపై కూడా అక్కడక్కడా గుంతలు తేలాయి. అలాగే దత్తాపూర్ నుంచి నికాల్‌పూర్ వరకు దాదాపు 4.5కి.మీ రోడ్డు కూడా నాణ్యతగా కనిపించడం లేదు. రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయకపోవడంతో బీటీ రోడ్డు కోతకు గురవుతోంది. నాణ్యత పాటించని కాంట్రాక్టర్లకు అధికారులు మాత్రం బిల్లులు మంజూరు చేస్తుండడం గమనార్హం.

మోర్తాడ్ మండలంలో..

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ మండలంలోని ధర్మోరా, శెట్‌పల్లిల మధ్య చిన్న వంతెనను రూ.50లక్షలతో నిర్మించారు. వంతెన నిర్మాణం పూర్తి చేసిన తరువాత అప్రోచ్ రోడ్డును నిర్మించగా ఈ రోడ్డు పనులు సరిగా సాగకపోవడంతో కుంగిపోతుంది. తారు పైకి లేచి మట్టి కిందకు కూరుకుపోతుంది. కాంట్రాక్టర్ సరైన ప్రమాణాలు పాటించకపోవడంతో రోడ్డు కుంగిపోయినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే వడ్యాట్, దోన్‌పాల్‌ల మధ్య నిర్మించిన రోడ్డుపై ఇటీవల పెద్ద గుంత ఏర్పడింది. రోడ్ల నిర్మాణానికి సంబంధించి బిల్లులను చెల్లించడానికి ముందు క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేయాల్సి ఉంటుంది. అధికార పార్టీ నాయకులకు భయపడి అధికారులు నాణ్యతను పరిశీలించకుండానే సర్టిఫికెట్‌ను జారీ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఉన్నతాధికారులు స్పందించి, నాణ్యత ప్రమాణాలను గాలికి వదిలివేసి నిర్మించిన రోడ్ల బిల్లులు రికవరీ చేయాలని, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



మరమ్మతులు చేయిస్తాం..

డొంకేశ్వర్ మండలంలో ఇటీవల వేసిన బీటీ రోడ్లను పరిశీలిస్తాం. నాసిరకంగా ఉన్న, గుంతలు ఏర్పడిన చోట మళ్లీ మరమ్మతులు చేయిస్తాం. కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్లకు ఇరువైపులా మట్టిని వీలైనంత త్వరగా పోసేందుకు చర్యలు చేపడుతాం.
–రఘు, ఏఈ, ఆర్అండ్‌బీ

జీపీ కార్మికుల అరెస్టు



జీపీ కార్మికులతో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులు

నవీపేట: గత కొన్ని రోజులుగా సమ్మెలో ఉన్న జీపీ కార్మికులను మంగళవారం వేకువజామున పోలీసులు వారి ఇళ్లలోకి వెళ్లి బలవంతంగా అరెస్టు చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాయక్‌వాడీ శ్రీనివాస్, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు దేవేందర్‌సింగ్‌లతో పాటు వివిధ గ్రామాలకు చెందిన 56మంది జీపీ కార్మికులను అరెస్టు చేశారు. వీరిని పోలీస్ స్టేషన్‌కు తరలించాక, వర్షంలోనే సర్పంచ్ ఆసోల్ల శ్రీనివాస్, ఎస్‌హెచ్‌వో రాజారెడ్డి, నిజామాబాద్ నార్త్ జోన్ సీఐ సతీష్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీల ఆధ్వర్యంలో సుమారు 40మంది ప్రయివేటు కార్మికులతో పారిశుధ్య పనులను చేయించారు.

అరెస్టు సరికాదు...

శాంతియుతంగా సమ్మె చేస్తున్న జీపీ కార్మికులను అరెస్టు చేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డి మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న జీపీ కార్మికులను పరామర్శించి, సంఘీభావం తెలిపారు. నాళేశ్వర్ సర్పంచ్ ద్యాగసరిన్, నాయకులు శ్రీధర్, వంశీమోహన్, ఆనంద్, రామకృష్ణ, నాగభూషణం, రమణారావ్, గంగాధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జీపీ కార్మికులను ఎంఎస్‌పీ నాయకులు సైతం పరామర్శించి, సంఘీభావం తెలిపారు.

బోధన్: సమ్మె చేస్తున్న జీపీ కార్మికులు, ఉద్యోగులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రతినిధి మల్లేష్ అన్నారు. సమ్మెలో భాగంగా మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు ఎదుట నాయకులు, కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆఫీసులో అధికారులెవరూ లేకపోవడంతో కార్యాలయానికి వినతిపత్రం అందించారు. అలాగే జీపీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పుట్ట వరదయ్య డిమాండ్ చేశారు.

ఎన్‌డీఎస్ఎల్ లేఆఫ్ ఎత్తివేయాలి



బోధన్ ఎన్డీఎస్ఎల్ ఎదుట ధర్నా చేస్తున్న శివసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు

బోధన్: ఖండాంతర ఖ్యాతి గడించిన బోధన్ నిజాం షుగర్స్‌ను మూసివేసి తెలంగాణ ప్రభుత్వం బోధన్ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేసిందని, వెంటనే ఫ్యాక్టరీ లేఆఫ్ ఎత్తివేయాలని శివసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పసులోటి గోపికిషన్ పేర్కొన్నారు. ఈమేరకు పట్టణంలోని శక్కర్‌నగర్‌లోగల ఫ్యాక్టరీ ప్రధాన గేట్ ఎదుట మంగళవారం జోరుగా వర్షం కురుస్తున్నా.. పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపికిషన్ మాట్లాడుతూ.. ఫ్యాక్టరీని పునరుద్దరించాలని డిమాండ్‌తో గతంలో తాము బోధన్ నుంచి మెట్‌పల్లి వరకు పాదయాత్ర నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్మికుల బకాయిల వేతనాలు వెంటనే చెల్లించాలని, చనిపోయిన కార్మిక కుటుంబాలకు రూ.50 లక్షల ఆర్థిక సహాయం, వారింట్లో ఒకరి ప్రభుత్వ ఉద్యోగంకల్పించాలని డిమాండ్ చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గౌతంగౌడ్, నాయకులు మధుబాబు, రవికిరణ్, భూమయ్య, ప్రీతంగౌడ్, నర్సింలు, గోవింద్, శ్రీకాంత్, విజయ్‌కుమార్, లోకేష్‌గౌడ్, కృష్ణ, రాజు, శ్రీను, నరేందర్ పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

ఎడపల్లి(బోధన్): ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్‌లో జరగబోయే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి అసనేపల్లి అశోక్ మాదిగ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



భీమ్‌గల్: ప్యాకేజీ 21 ద్వారా మండలంలోని పెద్దవాగు, కప్పల వాగులను కాళేశ్వర జలాలతో నింపిన నేపథ్యంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు, రైతులు చెక్‌డ్యాం వద్ద సీఎం కేసీఆర్, మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నాయకులు నర్సయ్య, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించని లైన్‌మన్ మాకొద్దు

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామంలో విధులు నిర్వహిస్తున్న ట్రాన్స్‌కో లైన్‌మన్ కిషోర్ తమ సమస్యలను పరిష్కరించడం లేదని, ఈ లైన్‌మన్ మాకొద్దు అంటు వీడీసీ సభ్యులు పేర్కొన్నారు. ఈమేరకు వారు మంగళవారం ట్రాన్స్‌కో ఏఈ రవికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించకుండ నిర్లక్ష్యం వహిస్తుండటంతో తాము అనేక సమస్యలను ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రేషన్ బియ్యం అందించండి

బాల్కొండ: 20వ తేదీ వస్తున్నా, ఇప్పటికీ రేషన్ ఇవ్వకపోవడం సరికాదని, రేషన్ బియ్యాన్ని ప్రజలకు వెంటనే సరఫరా చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మంగళవారం ముప్కాల్ మండల కేంద్రంలో తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు గిరిస్వామి, ఎంపీటీసీ పద్మ, నాయకులు నర్సయ్య దినేష్, గడ్డం సంతోష్ పాల్గొన్నారు.

వర్షంలోనూ కొనసాగుతున్న సమ్మె

రుద్రూర్: మండలంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం 13వ రోజుకు చేరింది. ఏకధాటిగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కార్మికులు సమ్మె కొనసాగించారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని కార్మికులు పేర్కొన్నారు.

కొనసాగుతున్న రైతుల దీక్షలు..

రెంజల్(బోధన్): బండల్ల రోడ్డు నిర్మాణం కోసం మండలకేంద్రంలో స్థానిక రైతులు చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం వర్షంలోనూ కొనసాగాయి. గొడుగులు పట్టుకొని పలువురు రైతులు దీక్షలో కూర్చున్నారు. చుక్కరాజుగౌడ్, కటికల శ్రీనివాస్, కొండల్‌వాడి శ్రీనివాస్, ఆర్మూర్ సంజీవ్, అమ్రది వెంకటి, బుజ్జి, పోశెట్టి, ఉన్నారు.

ఏకధాటిగా కురుస్తున్న వర్షం



ఆర్మూర్‌లో కురుస్తున్న వర్షం



బోధన్‌లో అలుగు పారుతున్న పాండు చెరువు

- పలుచోట్ల నీట మునిగిన పొలాలు
- చెరువులు, కుంటలకు జలకళ

మాక్లూర్/ఆర్మూర్‌టౌన్/బోధన్‌టౌన్/బోధన్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో సోమవారం సాయంత్రం నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తోంది. మంగళవారం రోజంతా వర్షం కురుస్తుండటంతో చెరువులు, కుంటలు నిండిపోయి అలుగులు పారే పరిస్థితికి చేరుకున్నాయి. కొన్ని పల్లపు ప్రాంతాల్లో నాట్లు వేసిన పంటపొలాలు నీటమునిగాయి. పలు మండలాల్లో లోతట్టు కాలనీలు జలమయం అయ్యాయి. మాక్లూర్ మండలంలోని దాస్‌నగర్ సమీపంలో చిన్నాపూర్ మూలమలుపు వద్ద గల 63వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం పెద్ద గుంత ఏర్పడింది. గుంత లోతు తెలియక పలు వాహనాలు అందులో ఇరుక్కొని ప్రమాదానికి గురయ్యారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. బోధన్‌లోని పాండు చెరువులోకి వర్షపు నీరు చేరడంతో అలుగు పారుతుంది.



63వ నెంబర్ జాతీయ రహదారిపై ఏర్పడ్డ గుంత



నాగస్‌పల్లి పసుపు వాగులో వరద నీరు

చెరువులను తలపిస్తున్న రహదారులు



బర్కత్‌పుర కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన నీరు



నందిపేట ప్రధాన రహదారిలో నిలిచిన నీరు

నందిపేట్(ఆర్మూర్): నందిపేటలోని పలు కాలనీలో, లోతట్టు ప్రాంతాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో చిన్నపాటి జల్లులకు కాలనీలన్నీ జలమయమవుతున్నాయి. ఇటీవలి వర్షాలకు నందిపేటలోని లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. ప్రధాన రహదారి చెరువును తలపిస్తూ జలమయమవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే అంతర్గత రోడ్లపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి, నీరు నిలిచి ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్నారు. ప్రతియేటా ఈ దుస్థితి నెలకొంటున్నప్పటికీ పాలకవర్గం, అధికారులు శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్నారు. ఇప్పటికైనా పాలకవర్గం, అధికారులు స్పందించి, మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందిగా ఉంది..



రోడ్లన్నీ జలమయం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చిన్నపాటి వర్షానికి రోడ్డు జలమయమయి చెరువులను తలపిస్తున్నాయి. డ్రెయినేజీలు నిండిపోయి రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. పాలకవర్గం స్పందించి సమస్యలను పరిష్కరించాలి. – శేఖర్ రెడ్డి, నందిపేట

ప్రమదాలు జరుగుతున్నాయి..



చిన్నపాటి జల్లులకు రోడ్డు జలమయవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాదారులకు ఎక్కడ గుంత ఉందో తెలియడం లేదు. దీంతో గుంతలో పడి పలుమార్లు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. డ్రెయినేజీలను ఏర్పాటు చేసి, రోడ్డుపై గుంతలకు మరమ్మతులు చేపట్టాలి. –గంగాధర్, నందిపేట

నియామకం..

ఆర్మూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా..



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అరిగేల భావేష్‌ను నియమిస్తున్నట్లు సీనియర్ నాయకుడు కొల వెంకటేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్ మంగళవారం తెలిపారు. ఈమేరకు వారు భావేష్‌కు నియామక పత్రం అందజేశారు. నాయకులు జిమ్మి రవి, బాల కిషన్, పాషా, అబ్దుల్ పాల్గొన్నారు

భీమ్‌గల్ ఎస్సైగా..



భీమ్‌గల్: భీమ్‌గల్ పట్టణ నూతన ఎస్సైగా హరిబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అదిలాబాద్ ఎస్సైగా విధులు నిర్వహించిన హరిబాబు ఇటీవల బదిలీపై భీమ్‌గల్ వచ్చారు. కాగ ఇదివరకు ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన రాజ్ భరత్‌రెడ్డి ట్రాన్స్‌కో విజిలెన్స్ నిజామాబాద్‌కు బదిలీ అయ్యారు.

అఖండ హరినామ సప్తాహం ప్రారంభం



రుద్రూర్: కోటగిరిలోని విఠలేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అఖండ హరినామ సప్తాహం ప్రారంభమైంది. వచ్చే నెల 17వరకు కార్యక్రమం కొనసాగనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	మహావీరుడు – (తెలుగు) – 11.50, 06.45, 10.10 మిషన్ ఇంపాజిబుల్ (ఇం) – 3.15
స్క్రీన్-2 –	సామజవరగమన(తెలుగు)–10.00 4.10 రంగబలి (తెలుగు) 1.15 నాయకుడు – 7.10 ; బేబి – 10.25
స్క్రీన్-3 –	బేబి – 11.15, 2.50, 6.25, 10.00
స్క్రీన్-4 –	మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు) – 11.00, 2.30, 6.00 9.30

సంక్షిప్తం

సీసీ రోడ్ల పనుల పరిశీలన



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో ప్రారంభమైన సీసీ రోడ్డు పనులను మంగళవారం జెడ్పీటీసీ ఎర్రం యమున ముత్యం, బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు మండల పార్టీ అధ్యక్షుడు సాగర్, తదితరులు ఉన్నారు.

స్వర్ణామృతం ప్రాసనం పంపిణీ

నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రంలోని కేదారేశ్వర ఆశ్రమంలో మంగళవారం ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు



మహారాజ్ ఆధ్వర్యంలో చిన్నారులకు స్వర్ణామృతప్రాసనం పంపిణీ చేశారు. ఆశ్రమ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు

ఘనంగా మహిళ మహోత్సవం

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తోండ తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో మంగళవారం మహిళ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పది డ్వాక్రా సంఘాలకు రూ.1కోటి రుణాలను అందించారు. బ్రాంచ్ మేనేజర్ సుధాకర్, ఐకేపీ సిబ్బంది తదతరులు ఉన్నారు.

దళితరత్న అవార్డు గ్రహీతలకు సన్మానం

బాల్కొండ: దళితరత్న అవార్డు గ్రహీతలను మంగళవారం ముప్కాల్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర, జిల్లా కన్వీనర్ బాపురావు, మోతే భూమన్న, మోహన్, శ్రీనివాస్, పోశాని, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండలంలో దళిత రత్న అవార్డు గ్రహీతలను ఎమ్మార్పీఎస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బడుల్లో సౌకర్యాలు కరువు

బోధన్: పట్టణంలోని పలు ప్రయివేట్ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ఎస్ఎఫ్ఐ డివిజన్ కన్వీనర్ సాయికుమార్ తెలిపారు. మంగళవారం పలు ప్రైవేట్ పాఠశాలలను తాము సందర్శించి పరిస్థితులను పరిశీలించామని పేర్కొన్నారు. స్కూల్స్ యాజమాన్యాలు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు.

స్మైల్స్‌లో రేయిన్ డే

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్‌లోని స్మైల్స్ పాఠశాలలో మంగళవారం రేయిన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు గొడుగులతో వర్షంలో ఆడుతూ పాడుతూ ఉత్సాహంగా గడిపారు. అలాగే విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కరస్పాండెంట్ రఫీ గోహార్, ప్రిన్సిపల్ షబానా గోహార్ పాల్గొన్నారు.

కారంచేదు మృతవీరులకు అశ్రునివాళి

మోర్తాడ్: ఆంధ్రప్రదేశ్‌లోని కారంచేదు ఘటన జరిగి నేటికి 38 సంవత్సరాలు పూర్తయిందని ఈ సందర్భంగా మంగళవారం దళిత సంఘాల సభ్యులు మృతవీరులకు నివాళులు అర్పించారు. దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజారాం, నాయకులు అంగుళి మాలాజీ, మామిడి రాజు, సామ్రాట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.